RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 196 | ఆగస్టు 16 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 196 | August 16 Sunday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ప్రజల అవసరాలే పరమావధిగా సంక్షేమ పాలన: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2

# ప్రపంచ రంగాన భారత్ మార్క్



## ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ సందేశం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
భారతదేశానికి ప్రపంచస్థాయిలో నాయకత్వం వహించే సమర్థతతో పాటు అన్ని విభాగాల్లోనూ వేగంగా ముందంజ వేసే నైపుణ్యాలు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. స్వతంత్ర వేడుకల సందర్భంగా ఎర్రకోట నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఎటువంటి సవాళ్లనైనా స్వీకరించి విజయం సాధించే సత్తా మన సొంతమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత లక్ష్యంగా పలు కీలక సంక్షేమ పథకాలను ఆయన ప్రకటించారు. కోటి మంది యువకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతలో శిక్షణ ఇస్తామని, అలాగే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు.
అదేవిధంగా దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న జనాభా గణనలో యువత క్రియాశీలకంగా వ్యవహరించాలని ప్రధాని కోరారు. పౌరులు అందించే వివరాల ఆధారంగానే భవిష్యత్తు జాతీయ విధానాలు, వికాస పథకాలు రూపుదిద్దుకుంటాయని, అందుకే ప్రతి ఒక్కరూ కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత రోజువారీ సమయం నుంచి కనీసం ఒక గంట సమయాన్ని కేటాయించి, సమాజంలో జనాభా గణనపై సానుకూల వాతావరణం కల్పించాలని పిలుపునిచ్చారు.
దేశ అంతర్గత భద్రతపై మాట్లాడుతు అడవుల్లోని సాయుధ నక్సలిజాన్ని ప్రభుత్వం విజయవంతంగా అణచివేసినప్పటికీ, సమాజాన్ని తప్పుదోవ పట్టించే 'దిమాగీ నక్సల్స్' రూపంలో కొత్త సవాళ్లు మిగిలే ఉన్నాయని హెచ్చరించారు. అటువంటి విద్రోహ భావజాల శక్తులను గుర్తించి సమాజం నుంచి ఏకాకిని చేయాలని సూచించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక వసతులు, రక్షణ, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ మరియు సాంస్కృతిక బలాన్ని సమకూర్చే 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు.
స్వయం సమృద్ధి సాధనలో భాగమైన టెక్నాలజీ ప్రాధాన్యతను వివరిస్తూ, ఇప్పటికే దేశంలో మూడు

మిగతా 2వ పేజిలో..

# 'సప్తధార'తో వికసిత భారత్

## ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ సందేశం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్' మరియు స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలిచే ఏడు ప్రాథమిక విభాగాలను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు.
తొలి ధారగా మ్యానుఫ్యాక్చరింగ్ రంగాన్ని అభివర్ణించిన ప్రధాని, కేవలం చిన్న విడిభాగాలకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలక భాగస్వామిగా నిలవడానికి నాణ్యత, సరసమైన ధర, విస్తృత ఉత్పత్తి ప్రామాణికం కావాలన్నారు.

మిగతా 2వ పేజిలో..

# తెలంగాణలోనే ఉచిత సన్నబియ్యం పంపిణీ



**హైదరాబాద్ జనసంఘర్షణ**
సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంగారెడ్డి:దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలోనే నిరుపేదలకు సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కేవలం 89 లక్షల రేషన్ కార్డులు మాత్రమే ఉండేవని, తమ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 16 లక్షల మందికి కొత్తగా కార్డులు మంజూరు చేసి ఆ సంఖ్యను 2.80 కోట్లకు పెంచిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు రూ. 14,800 కోట్ల అంచనా వ్యయంతో సన్నబియ్యం సరఫరా

మిగతా 2వ పేజిలో..

# కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడేది లేదు

## గోల్కొండ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ జనసంఘర్షణ :**
తెలంగాణ నీటి హక్కుల విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని, రాష్ట్రానికి రావాల్సిన ప్రతి నీటి బొట్టునూ సాధించి పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చారిత్రక గోల్కొండ కోటలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. తమ ప్రభుత్వ 32 నెలల పాలనా ఫలితాలు ఇప్పుడిప్పుడే స్పష్టంగా కనిపిస్తున్నాయని, రాష్ట్రం తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీని ఏకకాలంలో పూర్తి చేశామని, రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించామని

మిగతా 2వ పేజిలో..

# ఉత్తరాఖండ్ టీహెచ్‌డీసీ సొరంగ ప్రమాదం

## ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య

**ఉత్తరాఖండ్ జనసంఘర్షణ :**
చమోలి జిల్లా పిపాల్‌కోటి వద్ద టీహెచ్‌డీసీ నిర్మాణంలో ఉన్న సొరంగంలో సంభవించిన భారీ ప్రమాదంలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బిర్హి నది సమీపంలో కొండచరియలు విరిగిపడి, ఒక్కసారిగా పెద్దఎత్తున వరదనీరు, శిథిలాలు సొరంగంలోకి దూసుకువచ్చాయి. ఈ ఊహించని విపత్తుతో అక్కడే విధుల్లో ఉన్న పలువురు కార్మికులు లోపల చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు సహాయక బృందాలను రంగంలోకి దించారు. సొరంగంలో చేరుకున్న బురద, నీటిని తొలగిస్తూ జరిపిన గాలింపు చర్యల్లో శనివారం మరొక మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 8కి పెరిగింది. లోపల

మిగతా 2వ పేజిలో..

# కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడేది లేదు

**మొదటిపేజీ తరువాయి..** వివరించారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తూ ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డు సృష్టించిందన్నారు. త్వరలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీరందిస్తామని హామీ ఇచ్చారు.
సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొంటూ.. కొత్తగా 15 లక్షలకు పైగా రేషన్ కార్డులు మంజూరు చేశామని, 5.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం రెండు విడతల్లో చేపడుతున్నామని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో విజయవంతంగా కులగణన నిర్వహించామని, కొత్తగా 2.50 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో తెచ్చిన మార్పులతో విద్యా సూచీలో రాష్ట్రం 21వ స్థానం నుంచి 14వ స్థానానికి మెరుగుపడిందని, నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు 100కు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు.

పారిశ్రామికంగా తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోందని, టీజీ-ఐపాస్ ద్వారా రూ. 1.95 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. దీని ద్వారా 78 వేలకు పైగా కొత్త ఉద్యోగాలు రాబోతున్నాయని, హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (+జజ) హబ్‌గా మార్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఎర్రకోటపై ప్రత్యేక ఆకర్షణగా ప్రధాని మోదీ రాజస్థానీ 'బాంధనీ' తలపాగా



న్యూఢిల్లీ:భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన సాంప్రదాయ రాజస్థానీ 'బాంధనీ' తలపాగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎరుపు, పసుపు, తెలుపు రంగుల చుక్కల ఆకృతులతో రూపొందించిన ఈ ప్రత్యేకమైన తలపాగాలో ప్రధాని ఎంతో ఆకట్టుకున్నారు. ఈ తలపాగాకు జతగా సరళమైన తెల్లటి కుర్తా-పైజామా, చాక్లెట్ గోధుమ రంగు జ్యాకెట్‌ను ధరించారు. అలాగే దేశభక్తిని ప్రతిబింబించేలా తన జేబులో జాతీయ జెండా రంగులైన కాషాయం, తెలుపు, ఆకుపచ్చ వర్ణాలతో కూడిన త్రివర్ణ 'పాకెట్ స్క్వేర్'ను ప్రత్యేకంగా ఆభరణంగా అమర్చుకున్నారు. భారతీయ సాంప్రదాయ వస్త్రకళలకు అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించే శైలిలో ప్రధాని మోదీ ప్రతీ ఏటా స్వాతంత్ర్య దినోత్సవ వేళ విభిన్న ప్రాంతీయ తలపాగాలను ధరించడం ఒక సంప్రదాయంగా వస్తోంది. రాజస్థాన్ మరియు గుజరాత్ ప్రాంతాలలో ఎంతో ప్రసిద్ధి చెందిన పురాతన 'టై-అండ్-డై' (దారాలతో ముడులు వేసి రంగులు అద్దే) పద్ధతిలో ఈ 'బాంధనీ' రూపుదిద్దుకుంటుంది. దారాలు విప్పిన తరువాత వస్త్రంపై ఏర్పడే అందమైన చుక్కలు, రేఖాగణిత నమూనాలు భారతీయ చేనేత కళానైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తాయి. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతి ఏటా ఎర్రకోటపై వేర్వేరు రంగుల 'సఫా'లు, తలపాగాలను ప్రధాని ధరిస్తూ రాగా, గతేడాది 2025లో ఆయన కాషాయ రంగు తలపాగాలో కనిపించారు. ఈ ఏడాది మరొకసారి సంప్రదాయ రాజస్థానీ డిజైన్‌కు ప్రాధాన్యతనిస్తూ, 'వొకల్ ఫర్ లోకల్' భావనను చాటిచెప్పేలా బాంధనీ తలపాగాను ఎంచుకోవడం సర్వత్రా ప్రశంసలు అందుకుంది.

## నేడు తెరుచుకోనున్న శబరిమల ఆలయం

**తిరువనంతపురం :** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారం తెరుచుకోనుంది. చింగం మాస పూజల నిమిత్తం ఆలయాన్ని తెరుస్తున్నామని, భక్తులకు సౌకర్యాలు కలిపించేందుకు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డ్ (టీడీబీ), కేఎస్‌ఆర్‌టీసీ తగిన ఏర్పాట్లు చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఆలయ పూజారి కందరారు బ్రహ్మదత్తన్ సమక్షంలో ఆలయ ప్రధాన పూజారి ప్రసాద్ ఇ.డి.ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని తెరుస్తారని టీడీబీ ఓ ప్రకటనలో తెలిపింది. మలయాళ నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకొని ఈనెల 17న ఉదయం 5 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. చింగం మాస పూజలు ముగిశాక ఆగస్టు 21 రాత్రి 10 గంటలకు ఆలయాన్ని మూసివేసి, తిరిగి ఓనం పండుగ పూజల కోసం ఈనెల 24న తెరుస్తారు.

# ప్రపంచ రంగాన భారత్ మార్క్

**మొదటిపేజీ తరువాయి..** సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, త్వరలోనే మరిన్ని రాబోతున్నాయని తెలిపారు. ఎలక్ట్రిఫికేషన్, హైడ్రోజన్ రైళ్ల వినియోగం, సౌరశక్తి వ్యాప్తితో పాటు న్యూక్లియర్ రియాక్టర్ల నిర్మాణం వేగవంతం చేశామని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రతిపక్షాలు రాజకీయ విభేదాలను పక్కనబెట్టి పార్లమెంట్, శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్ల ఆమోదానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శ్రేయస్సు ఎవరికి దక్కినా పర్లేదని, మహిళలకు ప్రాధాన్యత దక్కడమే ముఖ్యమని వ్యాఖ్యానించారు.
మరోవైపు ఈ చారిత్రాత్మక వేడుకలకు లోక్‌సభ, రాజ్యసభల ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే వరుసగా రెండోసారి కూడా హాజరుకాలేదు. తమ పదవులకు అనుగుణంగా సీటింగ్ ప్రోటోకాల్ కేటాయించడం లేదన్న కాంగ్రెస్ పార్టీ ఆరోపణల నేపథ్యంలో వారు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# ఉత్తరాఖండ్ టీహెచ్‌డీసీ సొరంగ ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** చిక్కుకుపోయిన మిగిలిన వారి కోసం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ మరియు జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు సమగ్ర దర్యాప్తునకు ఆదేశించామన్నారు. ఏ నిర్మాణ ప్రాజెక్టులోనైనా కార్మికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. సొరంగం లోపల టన్నుల కొద్దీ చేరుకున్న బురద, శిథిలాల వల్ల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని అధికారులు వెల్లడించారు.

# తెలంగాణలోనే ఉచిత సన్నబియ్యం పంపిణీ

**మొదటిపేజీ తరువాయి..** చేస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డుల కేటాయింపు అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని, అర్హులైన ప్రతి కుటుంబానికి దరఖాస్తులను పరిశీలించి కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని 80 శాతం మంది తినకుండా తక్కువ ధరకు అమ్ముకునేవారని, ఈ పరిస్థితిని మారుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు రూ. 500 క్వింటాలుకు బోనస్ ఇచ్చి మరీ కొనుగోలు చేస్తోందన్నారు. అలా సేకరించిన నాణ్యమైన సన్నబియ్యాన్ని మనిషికి 6 కిలోల చొప్పున లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తున్నామని వివరించారు. మేడిగడ్డ, సుందిళ్ల ప్రాజెక్టుల నుంచి చుక్క నీరు తీసుకోకుండానే రికార్డు స్థాయిలో ధాన్యం పండించామని, వరి కొనుగోళ్ల ద్వారా రూ. 90 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డు అనేది నిరుపేద కుటుంబాలకు ఒక గౌరవమని, ప్రభుత్వం కల్పించే ఆహార భద్రతకు సరైన గుర్తింపు అని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తూ సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు విశేష సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలే పరమావధిగా సంక్షేమ పాలన: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం:**
తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించిన భట్టి, తమ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నకిలీలను అరికట్టేందుకు ఈ కొత్త స్మార్ట్ కార్డుల్లో ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, ప్రత్యేక హోలోగ్రామ్, వాటర్ మార్క్, యూవీ లోగో సహా 9 రకాల భద్రతా ఫీచర్లను

# 'సప్తధార'తో వికసిత భారత్

**మొదటిపేజీ తరువాయి..** రెండో ధారగా వ్యవసాయం, ఆహార భద్రత ప్రాధాన్యతను నొక్కి చెబుతూ, దీర్ఘకాలిక ఆహార భద్రత కోసం ఉత్పాదకతను నిరంతరం పెంచాలని స్పష్టం చేశారు.
సాంకేతికత, మౌలిక వసతులు రక్షణ:
మూడో ధారగా నిలిచిన సాంకేతిక విభాగంలో డేటా సెంటర్లు, రోబోటిక్స్, నెక్స్ట్-జెన్ టెలికమ్యూనికేషన్స్ మరియు స్వదేశీ 6+ సాంకేతికతలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని తెలిపారు. నాలుగో ధారగా 'గతి శక్తి' ద్వారా రోడ్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు మరియు లాజిస్టిక్స్ కనెక్టివిటీని వేగవంతం చేస్తామన్నారు. ఐదో ధారగా 'రక్షా శక్తి' ప్రాధాన్యతను వివరిస్తూ, డ్రోన్లు మరియు కౌంటర్ డ్రోన్ వ్యవస్థల వంటి అత్యాధునిక సైనిక పరిజ్ఞానంలో ఆత్మనిర్భరత సాధించడమే లక్ష్యమని పేర్కొన్నారు.
హరిత ఇంధనం ఒ సాఫ్ట్ పవర్:
ఆరో ధారగా పర్యావరణ పరిరక్షణకు అనుగుణమైన హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని ఆవిష్కరించారు. చివరిగా ఏడో ధారగా భారత 'సాఫ్ట్ పవర్' బలాన్ని ప్రస్తావిస్తూ యోగా, హస్తకళలు, సినిమాలు, గేమింగ్ మరియు వేగంగా విస్తరిస్తున్న కాన్సర్ట్ ఎకానమీ ద్వారా పర్యాటక రంగాన్ని అంతర్జాతీయంగా బలోపేతం చేస్తామన్నారు. ఈ సప్తధారల సంస్కరణలు 2047 నాటికి దేశాన్ని సంపూర్ణ స్వయంసమృద్ధి కలిగిన వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో కీలకం కానున్నాయని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎర్రకోటపై వరుసగా 13వసారి జాతీయ పతాకం ఆవిష్కరించిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :**
దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. రాజధాని ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోటపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ ఏడాది వేడుకల్లో దేశ చరిత్రలోనే తొలిసారిగా 'వందేమాతరం' గేయాన్ని సంపూర్ణంగా ఆలపించడం విశేషం. ఆ తర్వాత జాతీయ గీతం 'జనగణమన' ఆలాపన సమయంతో పాటు, వాయుసేనకు చెందిన హెలికాప్టర్లు ఎర్రకోట పరిసరాలపై పూలవర్షం కురిపించాయి. ఒక హెలికాప్టర్ త్రివర్ణ పతాకాన్ని, మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న జెండాను ప్రదర్శిస్తూ ఆకాశంలో విహరించాయి.
వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి హోదా కల్పిస్తూ ప్రభుత్వం చట్టం తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ చట్టం ప్రకారం వందేమాతరానికి ఆటంకం కలిగించినా లేదా అవమానించినా శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తారు. జెండా ఆవిష్కరణకు ముందు ప్రధాని మోదీ రాజ్‌ఘాట్ చేరుకుని మహాత్మా గాంధీకి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఎర్రకోట వద్ద సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ.. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశంలోని ప్రతి హృదయం 'వందేమాతరం' నామస్మరణతో, ప్రతి ఇల్లు త్రివర్ణ పతాకంతో మెరిసిపోతోందన్నారు. గతంలో బలహీన ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఉన్న భారత్, గడిచిన 12 ఏళ్లలో వేగంగా వృద్ధి చెందుతున్న శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందిందని హర్షం వ్యక్తం చేశారు. కాగా, భారతీయ వస్త్ర కళలు, సంస్కృతి మరియు నేత కార్మికుల శ్రమను ప్రతిబింబించేలా ప్రముఖ సెర్చ్ ఇంజిన్ 'గూగుల్' 22 విభిన్న ప్రాంతీయ డిజైన్లతో ఒక ప్రత్యేక డూడుల్‌ను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపింది.

## ఒలంపిక్స్‌లో ప్రతి క్రీడలో భారత భాగస్వామ్యం ఉండాల్సిందే

### ఎర్రకోటపై నుంచి క్రీడాకారులకు ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ :** స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ భారత క్రీడా రంగానికి ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించారు. 2036లో జరిగే ఒలింపిక్స్‌లో ప్రతి క్రీడలో భారత భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ప్రతిభ ఉన్న వారిని గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, సౌకర్యాలు అందించేందుకు జాతీయస్థాయిలో టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించారు. క్రీడా ప్రపంచంలో భారత్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. ప్రపంచవేదికలపై మన జాతీయ గీతాన్ని తరచూ వింటుంటాం. మన మువ్వన్నెల జెండా ఎగరవేయడం చూస్తున్నాం. టాప్స్(÷ుజీసణ।బి క్షపూతిఇ ఖనీటతిబీప ÷ూఇర।ప।) గొప్ప విజయాన్ని సాధించింది. ఖేలో ఇండియా గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్, బీచ్ గేమ్స్, వింటర్ గేమ్స్, స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ ఇలా ఏ రంగంలోనైనా భారతదేశం వేగంగా దూసుకుపోతోంది. 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు మనం కూడా పోటీపడుతున్నాం. 2030లో కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇస్తున్నాం. ఒలింపిక్స్‌లో దాదాపు 40 క్రీడాంశాలు, సుమారు 350 ఈవెంట్లు ఉంటాయి. అయితే చాలా క్రీడల్లో కనీస అర్హత సాధించలేక పోతున్నందున.. మూడింట రెండొంతుల గేమ్స్‌లో మనం పోటీ కూడా పడలేకపోతున్నాం. 2036లో మనం కనీసం మూడు వంతుల ఈవెంట్లలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాం. టాలెంట్ హంట్‌తో దేశంలోని ప్రతిచోట నుంచి 5 నుంచి 15 ఏళ్ల వయసు గల ప్రతిభావంతులను గుర్తిస్తాం. వారు ప్రత్యేక శిక్షణ పొందుతారు' అని మోదీ

# అభివృద్ధి, సంక్షేమమే ప్రజాప్రభుత్వం లక్ష్యం

- తెలంగాణ రైజింగ్--2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెడతాం.
- జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.
- మెప్మా అధ్వర్యంలో 3.5 కోట్ల రూపాయల జంబో చెక్కును లబ్ది దారులకు అందజేత.
- స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలకు సన్మాన కార్యక్రమం.
- 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో.
- తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ,కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రివర్యులు.జిల్లా ఇన్చార్జ్ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి.





**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (జన సంఘర్షణ)**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ప్రాంగణంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా ప్రాంగణానికి చేరుకున్న గడ్డం వివేక్ వెంకటస్వామికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,ఎస్పి డివి శ్రీనివాసరావు,పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు.మెదక్ నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక శాలువా కప్పి ప్రజా ప్రతినిధుల సమక్షంలో మంత్రికి సన్మానించారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. వారి పోరాటాలు,త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యతనిస్తూ, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ తెలంగాణను విశ్వవేదికపై సగర్వంగా నిలబెట్టేందుకు కృషి చేస్తోందని తెలిపారు.భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విచ్చేసిన స్వాతంత్ర్య సమరయోధులకు,ప్రజా ప్రతినిధులకు, పురప్రముఖులకు,జిల్లా ప్రజలకు, అధికారులకు, విద్యార్థినీ,విద్యార్థులకు, పాత్రికేయులకు నా హృదయ పూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. జాతిపిత మహాత్మా గాంధీ,జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో ఎందరో మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించుకున్నాం. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి ఆధ్వర్యములో రూపొందించబడిన రాజ్యాంగం మన దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచేలా చేసింది. మన ఆకాంక్షలను అర్థం చేసుకొని,మన సమస్యలను పరిష్కరించే ప్రజాస్వామ్య భారతదేశాన్ని రూపొందించుకున్నాం.భారత జాతి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు పోరాడిన త్యాగ ధనులందరికి ఈ సందర్భంగా జోహార్లు అర్పిస్తున్నాను.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాటాలు చేసిన తెలంగాణ వీరులకు జేజేలు పలుకుతూ, ఈ పోరాటంలో తమ ప్రాణాలు త్యాగం చేసిన తెలంగాణ అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనే గాక, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి, ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించడం జరిగింది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మహాలక్ష్మి: పథకం ద్వారా మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 4 కోట్ల 49 లక్షల సార్లు మహిళలు ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారు.దీని ద్వారా మహిళలకు 161 కోట్ల 49 లక్షల రూపాయల లబ్ది చేకూరిందని వివరించారు. విద్యుత్ శాఖ గృహజ్యోతి: మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 1 లక్ష 29 వేల 756 విద్యుత్ వినియోగదారులకు 200 యునిట్ల లోపు జీరో బిల్లు జారి చేయడం జరిగింది.ఈ పథకం ద్వారా ప్రభుత్వం మన జిల్లాలో ఇప్పటివరకు 108 కోట్ల 80 లక్షల సబ్సిడి అందజేసింది అన్నారు. జనవరి 2024 నుండి జూలై -2026, 6,663 బావులకు రూ. 49 కోట్ల 97 లక్షలతో విద్యుత్ కనెక్షన్లు విడుదల చేయడం జరిగింది. అని వెల్లడించారు.వ్యవసాయ శాఖ- రైతు భరోసా:పట్టా పాస్ బుక్ కలిగి ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా పెట్టుబడి మద్దతు పథకం కింద ఎకరానికి రూ.6,000/- ఇవ్వబడుతుంది. మెదక్ జిల్లాలో వానాకాలం 2026 సంవత్సరముకు గాను మొత్తం 2,66,674 మంది రైతుల ఖాతాల్లో 222 కోట్ల 69 లక్షల రూపాయలు ఇప్పటి వరకు చేయడం జరిగిందన్నారు.వానాకాలం 2026 ఎల్నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువ నమోదు అయ్యే అవకాశం ఉన్నందున తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా వరికి బదులుగా ఆరు తడి పంటలు వేయాలని సూచించింది. ఇందులో భాగంగా మెదక్ జిల్లాలో వరికి బదులుగా 28,933 ఎకరాల ఆరు తడి పంటలు కంది, మినుము, పెసర, సోయాబీన్, మక్కజొన్న,ఆముదం, కూరగాయలు,ఆయిల్ ఫామ్ మొదలైన పంటలు వేయడం జరిగింది. అని వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖ రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచి అమలు చేస్తున్నాము. ఈ పథకం ద్వారా మెదక్ జిల్లాలో 39 వేల 339 మంది పేదలు చికిత్సలు పొందగలిగారు, అందుకు గాను ప్రభుత్వం 110 కోట్ల 84 లక్షల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మెదక్ జిల్లాలోని 1,076 అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆరోగ్య లక్ష్మి పథకం కింద 5,633 మంది గర్భిణీలు, 3,771 మంది బాలింతలకు, అలాగే 6 నెలల నుండి 3 సంవత్సరాల లోపు 24,954 మంది పిల్లలకు టేక్ హోమ్ రేషన్ అందిస్తున్నారు. 3-6 సంవత్సరాల వయస్సు గల 22,979 మంది పిల్లలకు రోజువారీగా గుడ్డు, సంపూర్ణ భోజనం, స్నాక్స్ అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు 100% విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు టేబుల్స్. బుక్ ర్యాక్స్, ప్రీ-స్కూల్ పుస్తకాలు, యూనిఫారాలు అందించారు. 3-6 సంవత్సరాల పిల్లలకు ఆటపాటలతో కూడిన ప్రీ-స్కూల్ విద్య అందిస్తూ అంగన్వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా అభివృద్ధి చేశామన్నారు.పౌర సరఫరా శాఖ:500 రూపాయలకే వంట గ్యాస్:మెదక్ జిల్లాలో గృహ జ్యోతి పథకం లో భాగంగా ఇప్పటి వరకు 1 లక్ష 27 వేల మంది లబ్ధిదారులకు 8 లక్షల 64 వేల 388 గ్యాస్ సిలిండర్లు సప్లై చేయడం జరిగింది మరియు దీనికి గాను ఇప్పటి వరకు 26 కోట్ల 14 లక్షల రూపాయలు సబ్సిడి క్రింద ప్రభుత్వం ఖర్చుచేసినది. అని వివరించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో 2 లక్షల 42 వేల 353 కుటుంబాలకు చౌక ధర దుకాణాల ద్వారా ఇప్పటి వరకు మూడు నెలలకు సరిపడే 15 వేల 33 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉచితంగా ఒకే సారి పంపిణి చేయడం జరిగింది.జిల్లాలో జనవరి 2025 నుండి ఇప్పటి వరకు 28 వేల 582 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగింది మరియు కార్డులలో పిల్లలను చేర్చుట తదితర మ్యుటేషన్లు వంటి 1 లక్ష 06 వేల 448 మంది కొత్త సభ్యులను రేషన్ కార్డులలో చేర్చడం జరిగినది. ఇందుకు గాను 6 వందల 38 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం రేషన్ కార్డు దారులు లబ్ది పొందుతున్నారని తెలిపారు . యాసంగి 2025-26 సీజన్లో జిల్లాలోని రైతులందరికీ నిర్దేశించిన మద్దతు ధర కల్పించుటకై, వరి దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 4 లక్షల 25 వేల 305 మెట్రిక్ టన్నుల వరి ధాన్యంను 1 లక్ష 344 మంది రైతుల నుండి కొనుగోలు చేసి ఇప్పటి వరకు 1 వేయి 16 కోట్ల 6 లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందని వెల్లడించారు. మెదక్ జిల్లాలో 2,41,393 మంది రేషన్ కార్డు లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందించనున్నారు. విద్యా శాఖ: మెదక్ జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరంలో 905 ప్రభుత్వ పాఠశాలలలో 72,896 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు అన్నారు. ప్రజా ప్రభుత్వం విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టిపిఎస్) ను ఏర్పాటు చేస్తోంది ఇందులో భాగంగా మెదక్ జిల్లాకు రెండు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ మంజూరు కావడం జరిగింది. వీటిని సుమారు 20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారని ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం మెదక్ జిల్లా రామాయంపేటలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (××ూా) స్థాపనకు మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పాఠశాలను 20 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 200 కోట్ల వ్యయంతో నిర్మిస్తూ, 2,500 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థ్యంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 120 ప్రాథమిక పాఠశాలలో 1417 విద్యార్థులకు ప్రీ ప్రైమరీ (పూర్వ ప్రాథమిక విద్య) తరగతులు నిర్వహించబడుతున్నాయని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చిన్న మరమ్మతు పనుల నిమిత్తం మొత్తం రూ. 326.00 లక్షలు మంజూరు చేయ బడి నాయని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు :సొంత ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి రూ.5 లక్షల సబ్సిడీతో, గౌరవప్రదంగా నివసించేలా పక్కా గృహాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా మన మెదక్ జిల్లాలో మొదటి విడత కింద రూ.447.75 కోట్ల బడ్జెట్తో మొత్తం 8,955 ఇండ్లను మంజూరు చేయడం జరిగింది. రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం, కూడా ప్రారంభం చేసుకున్నాం, రెండవ విడతలో గుడిసెలో నివాసం ఉంటున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగినది, గుడిసెలు లేని గ్రామలే ప్రభుత్వ లక్ష్యం. అని చెప్పారు.మంజూరైన ఇండ్లలో ఇప్పటికే 7,382 ఇండ్ల నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభమై,అందులో 4,353 ఇండ్లు పూర్తి స్థాయి నిర్మాణానికి చేరుకోగా, మిగిలినఇండ్లన్నీ వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇండ్ల నిర్మాణ ప్రగతిని బట్టి ఇప్పటివరకు 6,309 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో రూ. 169 కోట్ల 18 లక్షల రూపాయలు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు రెవిన్యూ శాఖ రీ సర్వే :తెలంగాణా ప్రబుత్వం రాష్ట్రంలో భూముల రిసర్వే విదానం (డిజిటల్ సర్వే ) చేయుటకు అధికారికంగా ప్రకటన చేయగా అందులో బాగముగా మెదక్ జిల్లా యందు భూమి కొలతలు, రికార్డుల కార్యలయం నందురి సర్వే యందు బాగముగా తెలంగాణా సర్వే మరియు సరిహద్దుల చట్టం విభాగము. మొదటి విడతగా (24), (70) చేయడం జరిగినది. అందులో బాగముగా (10) గ్రామములు యొక్క రి సర్వే పూర్తి చేయడం జరిగినది దీనికి సంబంధించి 9 (2) నోటీసులు జారి చేయడం జరుగుతున్నది నైనది దీనికి సంబందించి అబ్యంతరాలు స్వకరణ తర్వాత, వాటిని నివృతి చేసి కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వటానికి సంసిద్ధత అవుచున్నాము అని తెలుపటానికి గర్వ పడుచున్నాము. తెలంగాణా రాష్ట్రంలో మెదక్ జిల్లా మొదటి స్థానంలో ఉన్నందుకు గర్వ పడుచున్నాము.అని వెల్లడించారు.అటవీ శాఖ:జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా ఈ సంవత్సరం 31 లక్షల 95 వేల మొక్కలు నాటుట లక్ష్యం కాగా ఇప్పటి వరకు 14 లక్షల 30 వేల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ 2026-27 ఆర్థిక సం.లో బ్యాంక్ లింకేజ్ 12000 సంఘాలకు 610.72 కోట్లు లక్ష్యానికి గాను ఇప్పట్టి వరకు 1819 సంఘాలకు 145.62 కోట్లు రూపాయల ఋణాలు అందించి మహిళా సంఘాల సభ్యులకు చిన్న తరహ వ్యాపారాలు పెట్టించి వారి ఆర్థిక ప్రగతికి తోడ్పడడం ఎంతోఅభినందనీయమన్నారు.పర్యాటకం మెదక్ జిల్లాలోని పరిసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వన దుర్గా అమ్మవారి ఏడుపాయల ఆలయంలో వసతి గృహాల ఏర్పాటు కోసం టూరిజం శాఖ ద్వారా 7 కోట్ల రూపాయలు మజూరు చేసి, అలాగే మెదక్ పోర్ట్ పునరుద్దరణ కోసం 57 లక్షలు రూపాయలు మంజూరు. చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మెదక్ జిల్లాలో టూరిజం డెవలప్మెంట్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి మెదక్ జిల్లాలోని ప్రతి పౌరులు, అధికారులు, సిబ్బంది, మీడియా మిత్రులు సహకారంతో ప్రత్యేక అధికారి శ్రీమతి వాణి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతం కావడం విశేషంగా వెల్లడించారు. చివరిగా మెప్మ అధ్యర్యంలో 3.5 కోట్ల రూపాయల జంబో చెక్కును లబ్ది దారులకు అందించి, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికను అందించారు.స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలకు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు,అదరపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,మెదక్ ఆర్డీవో రమాదేవి, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్,మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు పుర ప్రముఖులు మీడియా మిత్రులు హాజరయ్యారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- త్రివర్ణ పథాకాన్ని ఆవిష్కరించిన మాజీ డిప్యూటీ స్పీకర్,మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి.
- అమరవీరుల త్యాగఫలితమే ఈనాటి స్వాతంత్ర్య దినోత్సవం.
- స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం చిరస్మరణీయం.
- మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షురాలు. పద్మాదేవేందర్ రెడ్డి.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (జన సంఘర్షణ)**

బీఆర్ఎస్ పార్టీకార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం వెనుక ఎందరో అమరవీరుల త్యాగాలు, స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం ఉన్నాయని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు.వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ లు ఆరేళ్ళ మల్లిఖార్జున్ గౌడ్,బట్టి జగపతి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ లు ఆకిరెడ్డి క్రిష్ణారెడ్డి, గంగా నరేందర్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు న్యాయవాది జీవన్ రావు,మెదక్ బిఆర్ఎస్ పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డమీది క్రిష్ణా గౌడ్,మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ లు మామిండ్ల ఆంజనేయులు, జుబేర్ అహ్మద్, మాయా గంగమణి మల్లేశం,మ్యాదరి దీపక్ కుమార్, ఖాజా సోహేల్, సాయి, మాజీ కౌన్సిలర్ లు ప్రభురెడ్డి, కిషోర్, ఆర్.కె. శ్రీనివాస్ లతో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు లింగారెడ్డి, సయ్యద్ సాదిక్ అలీ లతో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

# మెదక్ ఆరోగ్య శాఖలో 156 ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్

- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు కృషికి ఫలితం.
- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు చొరవతో ఉద్యోగాల జాతర.
- 156 పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం.
- ఆరోగ్య శాఖ బలోపేతానికి మరో ముందడుగు. మెదక్ మెడికల్ కాలేజీలో 156 ఉద్యోగాలు.
- 156 ఉద్యోగాలతో నిరుద్యోగులకు ఊరట.
- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావుకు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగ ఆశావహులు.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (జన సంఘర్షణ)**

మెదక్ నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపైఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరాన్ని పలుమార్లు వివరించిన నేపథ్యంలో మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మొత్తం 156 ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి జిల్లా యంత్రాంగం ద్వారా ప్రకటన వెలువడింది.మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాంట్రాక్ట్ విధానంలో 4 ప్రొఫెసర్లు, 5 అసోసియేట్ ప్రొఫెసర్లు, 6 సీనియర్ రెసిడెంట్లు, 3 ట్యూటర్ల పోస్టులకు కూడా దరఖాస్తులు ఆహ్వానించారు. అదేవిధంగా మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పూర్తిగా తాత్కాలికంగా భర్తీ చేయనున్న156 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరారు. ఈ పోస్టుల భర్తీతో ఒకవైపు మెడికల్ కాలేజీలో సిబ్బంది కొరత కొంతమేర తగ్గి వైద్య సేవలు మరింతసమర్థవంతంగా అందే అవకాశం ఉండగా, మరోవైపు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 156 ఔట్‌సోర్సింగ్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రక్రియ ప్రారంభమైంది.మెదక్ నియోజకవర్గంలో ఆరోగ్య శాఖను మరింత పటిష్ఠం చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు ఉన్నతాధికారుల దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లి, అవసరమైన సిబ్బంది నియామకంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఎమ్మెల్యే చొరవతో జిల్లా పరిపాలన నుంచి ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రకటన వెలువడటంతో ఉద్యోగ ఆశావహుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ అవకాశాన్ని సద్వి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

- యూనిఫాం అంటే కేవలం ఉద్యోగం కాదు..బాధ్యత,సేవ.
- ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా ముందుగా చేరేది పోలీసులే.
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (జన సంఘర్షణ)**

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాల నుంచి స్ఫూర్తి పొంది దేశ అభివృద్ధి, ప్రగతిలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.సమాజంలో ఎలాంటి ఘటన జరిగినా ముందుగా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలకు రక్షణ, సహాయ సహకారాలు అందించేది పోలీసులేనని అన్నారు. అత్యవసర, క్లిష్ట పరిస్థితుల్లో పోలీసు సిబ్బంది రెస్క్యూ టీమ్‌లా ముందుండి ప్రజలకు అండగా నిలుస్తారని తెలిపారు.పోలీసులపై కొందరు ఎందుకు ప్రతికూలంగా మాట్లాడుతున్నారనే ప్రశ్నకు స్పందిస్తూ సమాజంలో పోలీసుల పాత్ర “స్ట్రిక్ట్ పేరెంట్స్ లాంటిదని అదనపు ఎస్పీ అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భద్రత, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లే.. పోలీసులు కూడా ప్రజల భద్రత, రక్షణకే అత్యంత ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు.విద్యార్థులు ట్రిపుల్ రైడింగ్ చేయకుండా నిరోధించడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకుండా చూడటం, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవడం ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు కాదని స్పష్టం చేశారు. ప్రాణాలను కాపాడటం, ప్రమాదాలను నివారించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ప్రజల భద్రత కోసం పోలీసులు కూడా తల్లిదండ్రుల మాదిరిగా ముందస్తు చర్యలు తీసుకుంటారని, అందువల్ల కొన్ని సందర్భాల్లో కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని అన్నారు. పోలీసుల కఠినత్వం వెనుక ఎల్లప్పుడూ ప్రజల భద్రత, సంక్షేమమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గతంలో వామపక్ష తీవ్రవాదం వంటి సవాళ్లు ప్రధానంగా ఉండగా ప్రస్తుతం సైబర్ నేరాలు, డ్రగ్స్, ఆహార కల్తీ వంటి కొత్త తరహా నేరాలు, సవాళ్లు సమాజాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. మారుతున్న నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు.ప్రజలు పోలీసులకు సహకరించాలని, నేరాల నివారణలో భాగస్వాములు కావాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. అనుమానాస్పద కార్యకలాపాలు,సైబర్ మోసాలు లేదా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, ఇన్‌స్పెక్టర్లు మహేష్, రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
16 ఆగస్టు 2026

# అనారోగ్యాన్ని లెక్కచేయకుండా స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు


- **వైరల్ ఫీవర్,తీవ్ర జ్వరంతోనూ మెదక్ కోట మొత్తం ఎక్కి జాతీయ పతాకావిష్కరణ.**
- **వరుస కార్యక్రమాలకు హాజరై దేశభక్తి,ప్రజాసేవ పట్ల నిబద్ధత చాటిన మెదక్ ఎమ్మెల్యే.**
- **ఆరోగ్యం సహకరించకపోయినా బాధ్యతకు ప్రాధాన్యం.**
- **ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సేవా స్ఫూర్తిపై ప్రజల ప్రశంసలు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (జన సంఘర్షణ)

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ దేశభక్తి, ప్రజా బాధ్యత పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. వైరల్ ఫీవర్‌తో పాటు తీవ్ర జ్వరంతో ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ ముందుగా నిర్ణయించిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను రద్దు చేసుకోకుండా వరుసగా హాజరై జాతీయ పతాకావిష్కరణల్లో పాల్గొన్నారు.ముఖ్యంగా తీవ్ర జ్వరంతోబాధపడుతున్నప్పటికీ చారిత్రక మెదక్ కోటను పూర్తిగా ఎక్కికోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనారోగ్యంతో ఉన్న సమయంలో మెదక్ కోట ఎక్కడం శారీరకంగా ఎంతో శ్రమతో కూడుకున్నప్పటికీ, స్వాతంత్ర్య దినోత్సవం పట్ల ఉన్న గౌరవంతో డాక్టర్ రోహిత్ రావు వెనకడుగు వేయలేదు. కోట శిఖరానికి చేరుకుని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు.

**జ్వరంతోనూ మెదక్ కోట ఎక్కి జాతీయ జెండా ఆవిష్కరణ.**

ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం శనివారం ఉదయం 8.15 గంటలకు రాందాస్ చౌరస్తాలో నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు. అక్కడి నుంచి ఉదయం 8.30 గంటలకు మెదక్ కోటకు చేరుకున్నారు. వైరల్ ఫీవర్, తీవ్ర జ్వరంతో శరీరం నీరసంగా ఉన్నప్పటికీ మెదక్ కోటను పూర్తిగా ఎక్కి పైభాగానికి చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ దేశ స్వాతంత్ర్య వేడుకకు ప్రాధాన్యం ఇచ్చి కోటపైకి చేరుకోవడం అక్కడున్న నాయకులు, కార్యకర్తలు, స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.తదుపరి ఉదయం 9.30 గంటలకు మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన అధికారిక స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్మిక,ఉపాధి శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు.






**అనారోగ్యం కంటే బాధ్యతకే ప్రాధాన్యం.**

డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ తీవ్ర జ్వరంతో ఉన్నప్పటికీ ముందుగా ఖరారైన కార్యక్రమాలను రద్దు చేసుకోకుండా పాల్గొన్నారని ఆయన అనుచరులు తెలిపారు. విశ్రాంతి అవసరమైన పరిస్థితుల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలకు హాజరై జాతీయ పతాకానికి గౌరవం సమర్పించడం ఆయన దేశభక్తికి, ప్రజా బాధ్యత పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.ముఖ్యంగా తీవ్ర జ్వరంతోనే మెదక్ కోట మొత్తం ఎక్కి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తీరు పలువురిని కదిలించింది. "అనారోగ్యం శరీరాన్ని ఇబ్బంది పెట్టవచ్చు... కానీ దేశం పట్ల బాధ్యతను, సేవ చేయాలనే సంకల్పాన్ని ఆపలేకపోయింది" అంటూ పలువురు ఆయన సేవా స్ఫూర్తిని కొనియాడారు.

**ప్రజల మధ్య ఉండటమే తన బాధ్యతగా...**

ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రాధాన్యం ఇస్తున్న డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన సందర్భంలో తన అనారోగ్యాన్ని కూడా పక్కనపెట్టి ప్రజల మధ్య ఉండటం ప్రశంసనీయం అని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఆరోగ్యం సహకరించకపోయినా ఒక్క కార్యక్రమంతో సరిపెట్టకుండా రాందాస్ చౌరస్తా నుంచి మెదక్ కోట,ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ వరకు వరుస కార్యక్రమాలకు హాజరవడం ఆయన బాధ్యతాయుతమైన వైఖరిని ప్రతిబింబిస్తోందని అభిమానులు అభిప్రాయపడ్డారు.

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు.**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ముందుగా విడుదల చేసిన కార్యక్రమాల షెడ్యూల్ ప్రకారం మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, యువజన, మహిళా విభాగాల నాయకులతో పాటు వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కూడా వేడుకలను కవర్ చేశారు.**

ఎమ్మెల్యే ఆరోగ్యంపై అభిమానుల ఆందోళన ఒకవైపు ఎమ్మెల్యే చూపిన నిబద్ధతను ప్రశంసించిన ప్రజలు, మరోవైపు తీవ్ర జ్వరంతోనూ ఆయన వరుస కార్యక్రమాల్లో పాల్గొనడం పట్ల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అనారోగ్యంతోనే మెదక్ కోట ఎక్కిన విషయం తెలిసిన అభిమానులు ఆయన తగిన విశ్రాంతి తీసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తీవ్ర జ్వరంతో ఉన్నప్పటికీ మెదక్ కోట మొత్తం ఎక్కి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం ఆయన దేశభక్తికి నిదర్శనం. ప్రజాప్రతినిధిగా బాధ్యతను ఎంత గౌరవంగా తీసుకుంటారో ఈ ఒక్క సందర్భమే చెబుతోంది. డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మరింత ఉత్సాహంగా ప్రజాసేవలో కొనసాగాలని కోరుకుంటున్నాం" అని పలువురు స్థానికులు పేర్కొన్నారు.మొత్తంగా వైరల్ ఫీవర్,తీవ్ర జ్వరం తనను ఇబ్బంది పెడుతున్నప్పటికీ ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలకు హాజరవుతూ, మెదక్ కోటను పూర్తిగా ఎక్కి త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తన దేశభక్తిని, ప్రజాసేవ పట్ల అంకితభావాన్ని చాటుకున్నారని స్థానికులు కొనియాడారు. ఆయన నిబద్ధత మెదక్ నియోజకవర్గంలో ప్రత్యేకంగా చర్చకు రావడంతో పాటు ప్రజలు, నాయకులు, కార్యకర్తల నుంచి ప్రశంసలు అందుకుంది.

## రామాయంపేట పట్టణంలో బిజెపి పార్టీ నాయకులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (జన సంఘర్షణ)




80వ స్వాతంత్ర్య దినోత్సవాన్నిపురస్కరించుకుని రామాయంపేట పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంపై జాతీయ జెండా త్రివర్ణ పతాకాన్ని భారతీయ జనతా పార్టీ రామాయంపేట పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి ఎగురవేశారు.
ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి చింతల శేఖర్, రామాయంపేట బిజెపి కౌన్సిలర్ శంకర్ గౌడ్,పట్టణ ప్రధాన కార్యదర్శి అక్కల అనిల్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నరేందర్ చారి, బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ పట్టణ అధ్యక్షులు భానుచందర్,నాయకులు దోమకొండ రాములు,ఎల్లం గౌడ్,సిద్ధ రాములు,దామోదర్ రావు, మహిళా మోర్చా నాయకురాలు లావణ్య,పట్టణ అధ్యక్షులు కన్నయ్య, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు నాగరాజు, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు నిమ్మల సామి,పట్టణ ఉపాధ్యక్షులు బాసం అనిల్, బీజేపీ నాయకులు సంతోష్, నితిన్, సందీప్, సతీష్ రావు, యువమోర్చా నాయకులు నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామాయంపేట ఉమ్మడి మండలంలోని భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..

- **జెండా ఆవిష్కరించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

కామారెడ్డి బ్యూరో/ఆగస్టు 15: /జన సంఘర్షణ



కామారెడ్డి, ఆగస్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కామారెడ్డి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు జిల్లా పరిషత్, క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టరేట్ పరిసరాలు దేశభక్తి నినాదాలతో సందడిగా మారాయి.



# దేశ సమగ్రత,ఐక్యతను కాపాడాలి

- **అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి.**
- **క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (జన సంఘర్షణ)



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. పోలీసు అధికారులు,సిబ్బంది సమక్షంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. దేశ సమగ్రత, ఐక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని ఎస్పీ తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. మహిళలు, బాలికలు, వృద్ధులు, బలహీన వర్గాల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.యువత మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. పోలీసు సిబ్బంది అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తూ ప్రజల భద్రతకు ముందువరుసలో నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్,సీఐలు కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, ఆర్‌ఐలు శైలేందర్,రామకృష్ణ, పోలీసు అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకల్లో చారిత్రక ఘట్టం..

- **ఎర్రకోటపై తొలిసారి వందేమాతరం**

న్యూఢిల్లీ/, ఆగస్టు 15: /జన సంఘర్షణ








న్యూఢిల్లీ దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట వేదికగా ఘనంగా జరిగాయి. ఈసారి వేడుకల్లో 'వందేమాతరం' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతీయ గీతానికి ముందు తొలిసారిగా 'వందేమాతరం' గేయాన్ని ఆలపిస్తూ దేశభక్తి భావాన్ని చాటారు. ఈ జాతీయ గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. జ్ఞాన్‌పథ్‌లో కూర్చున్న సుమారు 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 'మై భారత్' వాలంటీర్లు మానవ హారంతో 'వందేమాతరం' ఆకృతిని ప్రదర్శించి ప్రత్యేక సందేశాన్ని అందించారు. భారత వైమానిక దళానికి చెందిన వీఅ-17 హెలికాప్టర్ ద్వారా 'వందేమాతరం 150 ఏళ్లు' వేడుకల బ్యానర్‌ను ప్రదర్శించడంతో పాటు పూల వర్షం కురిపించడం వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చింది. ఎర్రకోటపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుసగా 13వసారి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వేడుకలను వీక్షించేందుకు ఎర్రకోటకు తరలివచ్చిన విద్యార్థులను ప్రధాని మోదీ ప్రత్యేకంగా కలుసుకుని ఆప్యాయంగా పలకరించారు. దేశభక్తి గీతాలు, త్రివర్ణ పతాక రెపరెపలు, వైమానిక విన్యాసాలు, విద్యార్థుల సందడి మధ్య ఎర్రకోట ప్రాంగణం దేశభక్తి భావంతో మార్మోగింది. ఈ చారిత్రక వేడుకలకు ప్రముఖులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మెదక్ కలెక్టరేట్‌లో మువ్వన్నెల జెండా రెపరెపలు

- **జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ప్రతిమా సింగ్.**
- **గౌరవ వందనం సమర్పించిన జిల్లా కలెక్టర్.**
- **దేశభక్తి భావంతో మార్మోగిన కలెక్టరేట్ ప్రాంగణం.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (జన సంఘర్షణ)



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.వేడుకలకు హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ప్రతిమా సింగ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. మువ్వన్నెల జాతీయ పతాకం రెపరెపలాడుతుండగా కలెక్టరేట్ ప్రాంగణం దేశభక్తి భావంతో పులకించింది. ఈ సందర్భంగా వందేమాతరం, జనగణమన గీతాలను ఆలపించారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించు కుంటూ అధికారులు, ఉద్యోగులు జాతీయ పతాకానికి గౌరవం సమర్పించారు. జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొంది.



## ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో మార్మోగుతోంది: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ బ్యూరో /ఆగస్టు 15/జన సంఘర్షణ



ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో మార్మోగుతోంది ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. 'ఈరోజు ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో మార్మోగుతోంది. దేశంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురుతోంది. ఎందరో వీరుల బలిదానాల ఫలితమే ఈ స్వాతంత్ర్య దినోత్సవం. తొలిసారి ఎర్రకోట వద్ద వందేమాతరం ఆలపించాం. భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా ఎదుగుతోంది' అని ప్రధాని మోదీ కొనియాడారు. సంకల్పం దృఢంగా ఉంటే కఠిన సవాళ్లను సునాయసంగా ఎదుర్కోవచ్చని హితవు పలికారు.ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోదీ.ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోదీ దిల్లీలోని ఎర్రకోట వద్ద స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రధాని మోదీ జెండా మోదీ ఎగురవేశారు. అనంతరం జనగణమన ఆలపించారు. ఎర్రకోటపై వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేసి ప్రధాని మోదీ చరిత్ర సృష్టించారు.పేద విద్యార్థులకు ఫ్రీ కోచింగ్ ఆన్‌లైన్ కోచింగ్ ఇప్పిస్తాం మోదీ వెల్లడించారుపేద విద్యార్థులకు ఫ్రీ కోచింగ్ ఆన్‌లైన్ కోచింగ్ ఇప్పిస్తాం మోదీ. వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు యువతే కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2014కు ముందు దేశంలో కేవలం 400 మెడికల్ సీట్లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం వాటిని 800కి పెంచామని తెలిపారు. దేశానికి యువతే అతిపెద్ద శక్తి అని, వారే తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత కోచింగ్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో 350కి పైగా విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయని కూడా ఆయన తెలిపారు.కరోనా మహమ్మారి ప్రపంచాన్నే ముంచేసింది: మోదీకరోనా మహమ్మారి ప్రపంచాన్నే ముంచేసిందిమోదీ వెల్లడించారు కరోనా మహమ్మారి తర్వాత యుద్ధాలు ప్రపంచాన్ని అతలాకుతలం చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించాయని, పెట్రోల్, డీజిల్, ఎరువుల కొరత ఏర్పడుతుందని ప్రచారం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజలకు ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసిందని, సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొందని ప్రధాని తెలిపారు.

## ఎత్తోండలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

◆ **జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్**

కోటగిరి, /ఆగస్టు 15:/జన సంఘర్షణ)





భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కోటగిరి మండలం ఎత్తోండ గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ జెండాకు వందనం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలు తో కలిసి ఎత్తోండ గ్రామంలోని ఉర్దూ మీడియం పాఠశాలతో పాటు పలు ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుని వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆమె కోరారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎత్తోండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ తయ్యాబ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు షేక్ రఫీ, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రెండున్నరేళ్ల ప్రజా పాలనలో తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు

◆ **తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్ స్టేట్ చీఫ్ బ్యూరో/ఆగస్ట్ 15/జన సంఘర్షణ





హైదరాబాద్, ఆగస్టు 15: తెలంగాణ పునర్నిర్మాణానికి గత రెండున్నరేళ్ల ప్రజా పాలనలో బలమైన పునాదులు వేశామని, రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటపై జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం సీఎం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం**

గడిచిన 32 నెలల్లో ప్రజా ప్రభుత్వం నాలుగు కోట్ల మంది ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా భరోసా కల్పించిందని సీఎం తెలిపారు. పేదల ఆత్మగౌరవాన్ని కాపాడేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, తొలి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. 93 లక్షలకు పైగా కుటుంబాల్లోని సుమారు 3.38 కోట్ల మందిని ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోకి తీసుకొచ్చామని, 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు సహా 43 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు.

**రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది**

రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ పంజాబ్‌ను అధిగమించి దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా సాధించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తుమ్మడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**యువతకు ఉద్యోగాలు.. విద్యకు ప్రాధాన్యం**

తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రభుత్వ అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని సీఎం తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వ శాఖల్లో 72 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని చెప్పారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించామని వివరించారు. పరీక్షలు, ఫలితాలు, ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందించామని తెలిపారు. టీజీపీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసినట్లు వెల్లడించారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలతో తెలంగాణ పనితీరు మెరుగుపడిందని, కేంద్ర ప్రభుత్వ పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో రాష్ట్రం 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని సీఎం పేర్కొన్నారు.

**వైద్యరంగంలో భారీ మార్పులు..**

ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టామని రేవంత్‌రెడ్డి తెలిపారు. గోషామహల్‌లో 2 వేల పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో టిమ్స్ ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. 9 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించామని, మరో 8 మెడికల్ కాలేజీలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారా మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. డ్రగ్స్, ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఇందుకోసం 'టీజీ సేఫ్' వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని సీఎం చెప్పారు.

**తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యం**

రాష్ట్ర ఆర్థిక ప్రగతి వేగంగా కొనసాగుతోందని సీఎం అన్నారు. 2025-26లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, దేశ తలసరి ఆదాయం కంటే ఇది దాదాపు 91 శాతం అధికమని పేర్కొన్నారు. సాధించిన విజయాల ఆధారంగా తెలంగాణను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యమని తెలిపారు. ఐటీ రంగంలోనూ తెలంగాణ దూసుకుపోతోందని, 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని చెప్పారు. ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలకు పెరిగాయని, హైదరాబాద్‌లో 355కు పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు పనిచేస్తున్నాయని వివరించారు.

**ప్రజా సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం**

ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ఈ నెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఎం ప్రకటించారు. త్వరలో ఆన్‌లైన్ ప్రజావాణి పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చి ఎక్కడి నుంచైనా ప్రజలు తమ అర్జీలు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

**ప్రపంచంతో పోటీ పడుతున్న తెలంగాణ**

తెలంగాణ పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, ప్రపంచంతో పోటీ పడుతోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని చెప్పారు.ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు హైదరాబాద్ రూపురేఖలను మార్చబోతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**ప్రజల సహకారంతో మరింత ముందుకు"**

ప్రభుత్వం సాధించిన ప్రతి విజయంలో ప్రజలు, ఉద్యోగులు, అధికారులు కీలక భాగస్వాములని సీఎం అన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిని సమతూకంగా ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు."భగవంతుడి ఆశీస్సులతో పాటు ప్రజల ఆశీస్సులు, సహకారం ఉంటే తెలంగాణను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్తాం. దేశానికే ఆదర్శంగా నిలిచే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో పేర్కొన్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఘన సత్కారం




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 15 (జన సంఘర్షణ)

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రామాయంపేట ఫైర్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్.నరేష్,ఫైర్ ఫైటర్ కి అగ్నిమాపక శాఖలో విశిష్ట సేవలకు గుర్తింపుగా బెస్ట్ ఫైర్ ఫైటర్ గా ప్రశంసా పత్రం అందుకోవడం ఎంతో గర్వకారణమైన విషయం. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం మరింత ప్రత్యేకమైన గౌరవంగా నిలిచింది.ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం రామాయంపేట ఫైర్ స్టేషన్ ద్వారా అంకితభావంతో అందిస్తున్న సేవలకు లభించిన ఈ గుర్తింపు మరింత బాధ్యతను,ఉత్సాహాన్ని అందిస్తుంది.ఈ గౌరవం నా సేవలకు మరింత స్ఫూర్తినిస్తూ, భవిష్యత్తులో మరింత అంకితభావంతో విధులు నిర్వర్తించేందుకు ప్రేరణగా నిలుస్తుంది.

## హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



బోధన్, /ఆగస్టు 15:/జన సంఘర్షణ

బోధన్ పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 28వ వార్డు కౌన్సిలర్ ముజాహిద్ అలీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకున్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ నిర్వహించిన ఈ వేడుకల్లో కాలనీవాసులు, స్థానికులు తదితరులు పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా దేశ ప్రగతి, ప్రజల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

# జెండా పండుగలో పాల్గొన్న సామాజిక కార్యకర్త డాక్టర్ హకీం

◆ **విద్యార్థులు కష్టపడి చదివి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి: డాక్టర్ హకీం**

పోతంగల్, /ఆగస్టు 15/జన సంఘర్షణ)

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పోతంగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన జెండా పండుగ కార్యక్రమాల్లో సామాజిక కార్యకర్త డాక్టర్ ఎం.ఏ. హకీం పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులు, గ్రామస్థులు, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ హకీంను నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులతో ముచ్చటించిన ఆయన వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలపై ఆరా తీశారు.

**కష్టపడి చదివి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి....**

"నేటి విద్యార్థులే రేపటి భారత భవిష్యత్తు... విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలి" అని డాక్టర్ హకీం సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను... స్మరించుకుంటూ వారి ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

**అవసరమైన వారికి అండగా..**

డాక్టర్ హకీం తన సామాజిక సేవా.... కార్యక్రమాల్లో భాగంగా అవసరమైన వారికి తనవంతు సహాయాన్ని అందిస్తున్నారు. కుల, మతాలకు అతీతంగా నిరుపేదలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయం అందిస్తున్న ఆయన సేవలను పలువురు అభినందించారు.ఉమ్మడి మండల ప్రజలతో పాటు జిల్లా




ప్రజల్లోనూ... డాక్టర్ హకీం సామాజిక సేవలపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో విద్య, సామాజిక సేవ, పేదల సంక్షేమం వంటి కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొంటున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు, సామాజిక కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండా నీడలో దేశభక్తి నినాదాలతో పలు గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

# ప్రభుత్వ స్థలాలపై రియల్ కన్ను?

◆ రియల్ ఎస్టేట్ జోరుతో లేఅవుట్ల పేరుతో పుకార్లు.. అక్రమ లేఅవుట్లపై ఆందోళన
◆ ప్రభుత్వ భూములను కాపాడాలని అధికారులకు ప్రజలు, మేధావుల విజ్ఞప్తి"

పోతంగల్/ఆగస్టు 15/జన సంఘర్షణ

గత కొంతకాలంగా మందగించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం క్రమంగా పుంజుకుంటుండటంతో ప్లాట్ల కొనుగోళ్లకు డిమాండ్ పెరుగుతోంది. ఇదే అదునుగా కొన్ని ప్రాంతాల్లో లేఅవుట్ల పేరుతో పలు రకాల పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన మండల కేంద్రాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలకు ఆనుకుని ప్రైవేట్ భూములను కొనుగోలు చేసి, వాటితో పాటు ప్రభుత్వ భూములను కూడా లేఅవుట్లలో కలిపి విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ భూములపై రియల్ కన్ను?....**


ప్రైవేట్ భూములతో పాటు ప్రభుత్వ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో నామమాత్రపు అనుమతులు తీసుకుని లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూములను గుర్తించి వాటి హద్దులు స్పష్టంగా ఏర్పాటు చేయకపోతే భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కొనుగోలుదారుల్లో ఆందోళన....**

కష్టపడి సంపాదించిన డబ్బుతో సొంతింటి కలను నెరవేర్చుకోవాలని ప్లాట్ కొనుగోలు చేసే సామాన్యులు ఇలాంటి ప్రచారాలతో అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని కూడా కలిపి ప్లాట్ విక్రయిస్తే భవిష్యత్తులో తమకు న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని భయపడుతున్నారు. గతంలో నకిలీ పత్రాలు సృష్టించి భూముల విక్రయాలకు పాల్పడిన ఘటనలను గుర్తుచేస్తూ మరింత అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

**ప్రభుత్వ స్థలాలకు హద్దులు.. బోర్డులు ఏర్పాటు చేయాలి...**

మండల కేంద్రాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను అధికారులు వెంటనే గుర్తించి సర్వే నిర్వహించాలని మేధావులు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. ప్రభుత్వ భూములకు స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేసి, వాటి వద్ద 'ఇది ప్రభుత్వ స్థలం' అంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.అక్రమంగా లేఅవుట్లు ఏర్పాటు చేయడం,




ప్రభుత్వ భూములను ఆక్రమించడం, వాటిని ప్లాట్లుగా విక్రయించడం చట్టరీత్యా నేరమని బోర్డులపై స్పష్టంగా పేర్కొంటే కొనుగోలుదారులు కూడా అప్రమత్తంగా ఉండే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.




**ప్లాట్ కొనుగోలు ముందు జాగ్రత్త తప్పనిసరి...**

ప్లాట్ కొనుగోలు చేసే ముందు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాటలను నమ్మకుండా సంబంధిత రెవెన్యూ రికార్డులు, భూమి హక్కు పత్రాలు, లేఅవుట్ అనుమతులు, భూమి స్వరూపం తదితర వివరాలను పూర్తిగా పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైతే సంబంధిత అధికారుల వద్ద వివరాలు నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు నిర్ణయం తీసుకోవాలని చెబుతున్నారు.

**అధికారులు స్పందించాలంటున్న ప్రజలు.....**

ప్రభుత్వ భూములపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు అందలేదని సమాచారం ఉన్నప్పటికీ, ముందస్తు చర్యల్లో భాగంగా సంబంధిత రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ లేఅవుట్లపై నిఘా పెంచి, ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తే భవిష్యత్తులో ప్రభుత్వానికి నష్టం వాటిల్లకుండా, అమాయక కొనుగోలుదారులు మోసపోకుండా ఉంటారని వారు పేర్కొంటున్నారు.

## ఆ ఊళ్లో ప్లాస్టిక్ గ్లాసులు బంద్...

◆ పర్యావరణ పరిరక్షణకు ఎత్తోండ గ్రామపంచాయతీ వినూత్న నిర్ణయం

కోటగిరి, ఆగస్టు 15 (జన సంఘర్షణ):



పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ కోటగిరి మండలం ఎత్తోండ గ్రామపంచాయతీ పాలకవర్గం వినూత్న నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ప్లాస్టిక్ గ్లాసుల వినియోగంపై పూర్తిగా నిషేధం విధించారు. గ్రామంలోని హోటళ్లలో టిఫిన్, టీ తదితర అవసరాలకు ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ ప్లేట్లు వినియోగించకూడదని నిబంధనలు విధించారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా హోటళ్లకు ఉపయోగపడే గ్లాసులను గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ తన సొంత ఖర్చులతో పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడటంతో పాటు గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ మాట్లాడుతూ.. లిప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యకాంత్ అన్న, వార్డు సభ్యులు షేక్ మస్తాన్, ఆల్కే రమేష్, గ్రామ యువకులు దండు లాలు, హోటల్ యజమాని దండు భుమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోటగిరి తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కోటగిరి, ఆగస్టు 15 (జన సంఘర్షణ):



భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కోటగిరి తహసీల్దార్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గంగాధర్ చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ, సర్పంచ్ ,బర్ల మధుకర్ , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సాహిద్, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, గంగాధర్ దేశయి, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, సిద్దు, మార్కెట్ కమిటీ చైర్మన్, మైనార్టీ డైనమిక్ లీడర్, జుబేర్, వైద్ ప్రజలు తదితరులు పాల్గొని జాతీయ పండుగను ఘనంగా జరుపుకున్నారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం దేశభక్తి భావంతో ఉత్సాహంగా కొనసాగింది.

## కోటగిరి గ్రామపంచాయతీలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కోటగిరి, ఆగస్టు 15 (జన సంఘర్షణ):



భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కోటగిరి గ్రామపంచాయతీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బర్ల మధుకర్ చేతుల మీదుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారు చూపిన స్ఫూర్తితో దేశాభివృద్ధి, గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ ప్రాంగణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. పలువురు ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో డాక్టర్ ఎంఏ హకీమ్‌కు బీఆర్ఎస్ నేతల మర్యాదపూర్వక భేటీ

◆ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చ

పోతంగల్,/ ఆగస్టు 15/జన సంఘర్షణ:



బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, సమాజ సేవకుడు డాక్టర్ ఎంఏ హకీమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పోతంగల్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, సామాజిక సేవా కార్యక్రమాలపై నాయకులు చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోర్ శ్రీనివాస్, రత్నాకర్, అంజిరెడ్డి, యూసుఫ్ బేగ్, తెల్ల రవి, పోతంగల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుద్దాం నవీన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిషన్ వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్


సింగరేణి మండలం కొత్త గ్రామంలో మిషన్ వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మిషన్ వాక్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ బాధావత్ రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మిషన్ వాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాధావత్ రవి మాట్లాడుతూ, ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

అదేవిధంగా సమాజంలోని ప్రతి పేదవాడికి ఉచిత వైద్యం అందేలా మిషన్ వాక్ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు మిషన్ వాక్ టీం సభ్యులందరూ సమష్టిగా పనిచేయాలని ఆయన కోరారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతూ యువతకు అండగా నిలవడమే మిషన్ వాక్ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు...

మిషన్ వర్క్ యాక్టివ్ సభ్యులను మిషన్ వాక్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ బాధాత్ రవి శాలువాతో సత్కరించి జ్ఞాపిక శిల్డ్ బహుమతిగా ఇవ్వడం జరిగింది.

## వర్ని పోలీస్ స్టేషన్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

వర్ని, ఆగస్టు 15 (జన సంఘర్షణ):



నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ని ఎస్సై జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండాకు గౌరవ వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో జాతీయ జెండా రెపరెపలాడుతుండగా, దేశభక్తి వాతావరణం నెలకొంది. పోలీసు సిబ్బంది పరస్పరం స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్ని పోలీస్ స్టేషన్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## రుద్రూర్ మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



రుద్రూర్, /ఆగస్టు 15 /(జన సంఘర్షణ):


నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్ వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండాకు గౌరవ వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించి, వారి త్యాగాల స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా పాల్గొనడంతో హాస్టల్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

జన సంఘర్షణ

ఆదివారం
16 ఆగస్టు 2026

# కొత్త తండాలో మిషన్ వాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

- **యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం.. స్వగృహాన్నే శిక్షణ కేంద్రంగా మార్చిన డాక్టర్ బాదావత్ రవి**
- **స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నూతన సేవా కార్యక్రమానికి శ్రీకారం.. ర్యాలీగా తరలివచ్చిన డీపీవీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు**




**కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్ సింగరేణి మండలం, ఆగస్టు 15:**
సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మిషన్ వాక్ ఫౌండేషన్ మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి మండలం కొత్త తండా గ్రామంలో మిషన్ వాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఘనంగా ప్రారంభమైంది. మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాదావత్ రవి జాతీయ జెండాను ఆవిష్కరించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణ అందించి, వారి విద్యార్హతలకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని డాక్టర్ బాదావత్ రవి తెలిపారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుంచి.. తమ నైపుణ్యంతో అవకాశాలను సృష్టించుకునే స్థాయికి ఎదగాలన్నదే తన సంకల్పమని పేర్కొన్నారు.

**సేవా కార్యక్రమాలకు మరో కొత్త కోణం**

మిషన్ వాక్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు పేదలు, దివ్యాంగులు, పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ బాధితులకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్న డాక్టర్ బాదావత్ రవి.. ప్రస్తుతం యువత భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించడం చర్చనీయాంశంగా మారింది. వైద్య సహాయం అవసరమైన వారికి అండగా నిలవడం మాత్రమే కాకుండా.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఆలోచనతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది.

**స్వగృహాన్నే శిక్షణ కేంద్రంగా మార్చిన సేవా సంకల్పం**

సాధారణంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిని వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించుకుంటారు. అయితే డాక్టర్ బాదావత్ రవి తన స్వగృహాన్నే యువతకు ఉపయోగపడే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా మార్చడం ప్రత్యేకంగా నిలిచింది. తాను పుట్టి పెరిగిన ప్రాంతంలోని యువతకు ఏదో ఒక రూపంలో ఉపయోగపడాలనే తపనతో తనకు అందుబాటులో ఉన్న వనరులను సమాజానికి అంకితం చేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, శిక్షణ లేక అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్న యువతకు ఈ కేంద్రం ఒక మంచి వేదికగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**యువతకు నైపుణ్యమే భవిష్యత్తుకు ఆయుధం**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్హతలతో పాటు సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు కూడా అత్యంత కీలకమని పలువురు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ఈ నైపుణ్యాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలను పొందేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. ఒక యువకుడికి ఉద్యోగం కల్పించడం కంటే.. అతనికి అవసరమైన నైపుణ్యాన్ని నేర్పి జీవితాంతం తన కాళ్లపై తాను నిలబడేలా చేయడం మరింత గొప్ప సేవ అని డాక్టర్ రవి ఆలోచనకు పలువురు ప్రశంసలు తెలిపారు.

**డీపీవీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ**

కార్యక్రమానికి ణూఎ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ర్యాలీగా తరలివచ్చి డాక్టర్ బాదావత్ రవికి ఘన స్వాగతం పలికారు. విద్యార్థుల ర్యాలీ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని డాక్టర్ రవికి శుభాకాంక్షలు తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన దిశగా ప్రారంభమైన ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు.

**సేవే లక్ష్యంగా.. స్ఫూర్తిగా డాక్టర్ రవి**

డాక్టర్ బాదావత్ రవి చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలిస్తే సేవా భావం ఆయన మాటల్లోనే కాకుండా చేతల్లోనూ కనిపిస్తోందని మిషన్ వాక్ సభ్యులు తెలిపారు. అవసరంలో ఉన్నవారి వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, సాధ్యమైనంత మేరకు సహాయం చేయడం, సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవడం ఆయన నిరంతర సేవా కార్యక్రమాల్లో భాగమని పేర్కొన్నారు.ఇతరుల కోసం ఆలోచించడం ఒక గొప్ప లక్షణమైతే.. తన సొంత వనరులను కూడా ఇతరుల భవిష్యత్తు కోసం వినియోగించడం మరింత గొప్ప సేవా భావానికి నిదర్శనమని పలువురు కొనియాడారు.కొత్త తండాలో ప్రారంభమైన ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కేవలం ఒక శిక్షణ కేంద్రంగా కాకుండా.. గ్రామీణ యువత కలలకు వేదికగా, వారి నైపుణ్యాలకు బాటగా, కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు ఆధారంగా నిలవాలని ఆకాంక్షించారు.

**కార్యక్రమంలో మిషన్ వాక్ సభ్యుల సందడి**

ఈ కార్యక్రమంలో మిషన్ వాక్ సభ్యులు, ఆర్మీ సోల్జర్ దశరథ్, సురేష్, నరేష్, షరీఫ్, సాయి, అజయ్, పవన్ ప్రసాద్, షేర్ ఖాన్, హాజ్రా, పీకే సింగ్, నితిన్, రంగ, భద్రు, దేవా, సతీష్, రాయల శ్రీను, పవన్, ప్రసాద్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్త తండా నుంచి కొత్త ఆశలకు నాంది**

స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ జెండాను ఆవిష్కరించి.. అదే రోజున యువత భవిష్యత్తు కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుంది.
కొత్త తండాలో వెలిగిన ఈ నైపుణ్య దీపం భవిష్యత్తులో మరిన్ని గ్రామాలకు విస్తరించి.. ఎంతోమంది యువతకు ఉపాధి అవకాశాలకు మార్గం చూపాలని, అనేక కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబనకు బాటలు వేయాలని మిషన్ వాక్ సభ్యులు ఆకాంక్షించారు.యువతకు దారి చూపే ఆలోచన..అవకాశం కల్పించే సేవా సంకల్పం..స్వగృహాన్నే సమాజానికి అంకితం చేసే గొప్ప మనసు..ఇవే డాక్టర్ బాదావత్ రవి సేవా ప్రయాణానికి ప్రతిబింబాలని పలువురు అభినందించారు.

# కాక్రేడ్ బి సీత రామయ్య భవనంలో ఘనంగా జరిగిన 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 15(జనసంఘర్షణ):**




ఆగస్టు 15 న స్వాతంత్ర దినోత్సవ వేడుకలు, కామ్రేడ్ బడే సీత రామయ్య, బి ఎస్ రామయ్య భవనంలో బందెల చంటి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముందుగా బి ఆర్ అంబేద్కర్ ,మహాత్మా గాంధీ, భగత్ సింగ్,అల్లూరి సీతారామరాజు, రాజ్ గురు, సుభాష్ చంద్రబోస్, ల చిత్రపటాలకు పూలమాలలు వేసి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం ఈ స్వాతంత్ర్య వేడుకలను ఉద్దేశించి బందెల చంటి, దొడ్డి హరినాధ వర్మ,భీమగోని నవీన్ లు మాట్లాడుతూ 80 వ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ,చర్ల మండల ప్రజలందరికీ  మన దేశానికి స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అయినా పేద ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. సంపన్నులు మరింత ధనవంతులుగా ఉన్నారు, దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించినటువంటి ఎందరో మహనీయులు ఆశయాలను మర్చిపోయి,కేంద్ర ప్రభుత్వం దేశాన్ని తాకట్టు పెట్టే పరిస్థితి తీసుకొచ్చి అప్పుల ఊబి లో దేశ ప్రజలందరినీ తాకట్టు పెట్టిందని ,కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి పేద ప్రజలకు రైతాంగానికి నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్ లను, పేద ప్రజలకు ఉపాధిని, విద్యా, వైద్యం, అన్ని రకాల శాఖల నుండి పేద ప్రజలకు నష్టం కలిగించే  కలిగించే విధంగా నిత్యవసర ధరలు రోజు రోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశానంటే విధంగా పెరుగుతున్న పట్టించుకోనటువంటి పరిస్థితి మన దేశంలో మొట్టమొదటి స్థానంలో ఉందని ,ప్రతి భారత పౌరుడు ఈ దేశం కోసం తమ వంతు బాధ్యతగా పనిచేయాలని మన హక్కులను కాలరాస్తున్నటువంటి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పే విధంగా మనం మన కర్తవ్యాన్ని నిర్వర్తించాలని ఇది ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో  రైతు సంఘం నాయకులు భీమగోని నవీన్, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా మండల కన్వీనర్ ఉడుగుల షారోను, ఐద్వా మండల కార్యదర్శి పొడుపు గంటి సమ్మక్క, వరదల వరలక్ష్మి, సిపిఎం వార్డ్ మెంబర్ కట్టం స్పందన, మండల కమిటీ సభ్యులు శ్యామల చంద్రం, రైతు సంఘం అధ్యక్షులు శ్యామల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు దొడ్డి హరినాగ వర్మ, శ్రీ గణేష్ ఆటో యూనియన్ అధ్యక్షులు పామర్ బాలాజీ,ఉపాధ్యక్షులు బి సత్తిరాజు, యూత్ ప్రెసిడెంట్ కంచర్ల సతీష్, సీనియర్ నాయకులు గురునాథం ,రాంబాబు, సంజీవరావు .మిగతా కమిటీ సభ్యులు అందరూ చాలా ఉత్సాహభరితంగా పాల్గొన్నారు.

# కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

- **విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి..**
- **సైనిక విన్యాసాలు, గిరిజన నృత్యాలతో అలరించిన వేడుకలు**

**కామారెడ్డి, ఆగస్టు 15 జన సంఘర్షణ**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు వీహెచ్ హనుమంతరావు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా ఇందిరాగాంధీ స్టేడియంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





దేశభక్తి గీతాలకు విద్యార్థుల నృత్యాలు, సైనికుల విన్యాసాలు, గిరిజనుల సంప్రదాయ నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్టేడియం అంతా జాతీయ స్ఫూర్తితో మార్మోగింది.

**వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ.**

కనబరిచిన ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ముఖ్యఅతిథి వీహెచ్ హనుమంతరావు ప్రతిభా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రవిచంద్రతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూగురు వ్యవసాయ మార్కెట్ ఆఫీసులో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 15(జనసంఘర్షణ):**



చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాలాపన జరిగింది. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, చర్ల పిఏసిఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్ తో పాటు చర్ల మండల రైతులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ, వారి త్యాగాలు, సేవలను కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి  ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, చర్ల పిఎసిఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, జవ్వాది రవికుమార్, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, సుందరి సురేష్, మేడిచర్ల వీరకుమార్, చల్లకోటి వాసు, పెద్దిరాజు, తోట మల్ల వరప్రసాద్, పటేల్ వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి, బాల బాలు, పరిటాల సంతోష్,మునిగెల వెంకన్న, పూజారి రమణయ్య, జితేంద్ర నాయుడు, దోమల రవి, కణితి శ్రీనివాసరావు తదితర నాయకులు, రైతులు, చర్ల మ్యాజిక్ యూనియన్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది  పాల్గొన్నారు.

# వనవాసీ కల్యాణ పరిషత్ విద్యార్థిని సేవలు మరువలేనివి

- **పూజారికాంకేర్ మాజీ సర్పంచ్ శోభారాణి**
- **సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందజేత**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం, ఆగస్ట్ 15 (జనసంఘర్షణ):**
చర్ల మండలంలో వనవాసీ విద్యార్థుల అభివృద్ధికి వనవాసీ కళ్యాణ పరిషత్ చేస్తున్న సేవలు మరువలేనిదని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజపూర్ జిల్లా పూజారి కాంకేర్ మాజీ సర్పంచ్ మజ్జా శోభారాణి అన్నారు. స్వతంత్ర దినోత్సవం సందర్భంగా చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయంలో జరిగిన 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆమె ముఖ్య అతిదిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్దుల అవసరార్దం రెండు సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందచేసారు. ఈ సందర్భంగా వానవాసి కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్ది నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అద్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్దులను ఉద్దేసించి ప్రసంగించారు. వనవాసీ పిల్లల చదువుల కొరకు దేశ వ్యాప్తంగా అనేక నిలయాలను ఏర్పాటు చేయడం అబినందనీయమని పేర్కొన్నారు. సంస్ద సేవలకు ఆకర్షితురాలినయిన తాను గత మూడేళ్లుగా తన వంతు బాద్యతగా వితరణలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి విద్యార్ది దేశభక్తి కలిగి ఉండాలని అన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్దితికి చేరుకోవడం ద్వారా తల్లిదండ్రుల కలను సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, శబరి బాలికా నిలయ కార్యదర్శి బందా స్వరూపరాణి, కొమరం భీం సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, సంతోష్ పాల్గొన్నారు.







# రుద్రూర్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **"సీఐ కృష్ణ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ**

**రుద్రూర్,/ఆగస్టు 15/జన సంఘర్షణ :**
భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని రుద్రూర్ సీఐ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. రుద్రూర్ సీఐ కృష్ణ పోలీస్ సిబ్బందితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు.



# స్వతంత్ర దినోత్సవ వేడుక ఘనంగా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలం, ఆగష్టు 15(జనసంఘర్షణ):




దుమ్ముగూడెం మండల కేంద్రంలో లక్ష్మీనగరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో మండల అధ్యక్షులు జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వారి ఆశయాలను స్మరించుకకుంటు స్వాతంత్ర్య వేడుకలు ముఖ్యాంశాలు జెండా ఆవిష్కరణ: దేశవ్యాప్తంగా రాష్ట్రంలో ఆగస్టు 15 2026 న ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. అదే విధంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తెల్లం హరికృష్ణ తమ పార్టీ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశి, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి ప్రముఖులతో పాటు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎందరో మహానీయుల త్యాగాలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా శాంతి, సమానత్వం, సౌభ్రాతృత్వం, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ జాతీయ జెండా ఆవిష్కరణ కీ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా సీనియర్ నాయకులు, ఈ యొక్క జండా ఆవిష్కరణ కు ప్రతి ఒక్కరు హాజరు కావడం జరిగింది.

## రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్సై మనోజ్ కుమార్

రుద్రూర్, /ఆగస్టు 15/ జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మనోజ్ కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఎస్సై మనోజ్ కుమార్ పోలీస్ సిబ్బందికి సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం ముందుండాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు.

## భారతీయ జనతా పార్టీ రుద్రూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

రుద్రూర్: ఆగస్టు 15( జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ మండల కార్యాలయంలో భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను బీజేపీ రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా కౌన్సిల్ సభ్యులు గూడూరు ప్రశాంత్ గౌడ్, మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, మండల మహిళా మోర్చా అధ్యక్షులు ఇత్తడి నాగరాజకుమారి కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎర్రోళ్ల గంగాధర్ ,మండల ఉపాధ్యక్షులు భోజిగొండ అనిల్, బేగరి వినోద్ కుమార్, గుడిసె ప్రభాకర్, జీలకర్ర విజయ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, జి.శివకుమార్, మండల సీనియర్ నాయకులు,పార్వతి మురళి,బీవీ గుప్తా, చిదురా మహిపాల్, సుధాకర్, గొల్లశంకర్, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## రుద్రూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

రుద్రూర్, /ఆగస్టు 15:/జన సంఘర్షణ




నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# గుంపెల్ల గూడెంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జవాన్ బానోత్ దశరథ్‌కు ఘన సన్మానం..
- అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు





సింగరేణి మండలం: గుంపెల్ల గూడెం గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులను స్మరించుకున్నారు. గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన మహానీయులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళు లర్పించారు. స్వాతంత్ర్యం సాధించడానికి ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

**అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అంబేద్కర్ ఆశయాలు, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కల్పించేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన కృషిని స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

**జవాన్ బానోత్ దశరథ్‌కు ఘన సన్మానం**

ఈ సందర్భంగా దేశ రక్షణలో సేవలందిస్తున్న భారత సైన్య జవాన్ బానోత్ దశరథ్‌ను గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి వీరబాబు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తూ దేశ రక్షణకు అంకితమవుతున్న సైనికులకు గౌరవం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున గ్రామానికి చెందిన సైనికుడిని సన్మానించడం గ్రామ యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు. దేశం కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న సైనికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. దేశ భద్రత కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు, సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. జవాన్ బానోత్ దశరథ్‌ను సన్మానించిన సందర్భంగా గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామంలోని యువత దేశ సేవ, సమాజ సేవ వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధికి ఐక్యంగా ముందుకు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం కేవలం జాతీయ పండుగ మాత్రమే కాకుండా దేశం కోసం ఎంతోమంది చేసిన త్యాగాలను గుర్తు చేసుకునే గొప్ప రోజు అని అన్నారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. యువత విద్య, ఉపాధి, క్రీడలు, దేశ సేవ వంటి రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామంలో జాతీయ పండుగలను అందరూ కలిసి నిర్వహించడం ద్వారా యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత మరింత పెంపొందుతుందని పలువురు పేర్కొన్నారు. ముఖ్యంగా సైనికులను గౌరవించడం ద్వారా చిన్నారులు, యువతలో దేశ సేవ పట్ల స్ఫూర్తి కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్ బానోత్ దశరథ్, అజయ్, సాయి, ప్రసాద్, పాటమ్మ నాగేంద్రబాబు, సైదులు, గ్రామ పెద్దలు లక్ష్మ, సక్రు, ఉపసర్పంచ్ శంకర్, రామ, హత్య, భావ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఆంధ్ర అంకుల్ రాయపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. జాతీయ పతాకం రెపరెపలాడుతుండగా, దేశభక్తి నినాదాలతో గుంపెల్ల గూడెం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. దేశం కోసం సరిహద్దుల్లో సేవలందిస్తున్న ప్రతి సైనికుడికి గౌరవం ఇవ్వడం.. దేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను గౌరవించడం.. గ్రామాభివృద్ధికి ఐక్యంగా పనిచేయడం–ఇదే స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తి అని గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

# రేషన్ కార్డు మీ ఆత్మగౌరవం..

- బియ్యం తెచ్చే సాధనం కాదు.. ఎక్కడికెళ్లినా మీ ఆకలి తీర్చే కార్డు

సంగారెడ్డి,/ ఆగస్టు 15 / జన సంఘర్షణ





రేషన్ కార్డు అనేది కేవలం బియ్యం తెచ్చుకునే పత్రం కాదని, అది పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్‌పై సీఎం తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు అయినా ఇచ్చారా? అని మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. "రేషన్ కార్డు బియ్యం తెచ్చే సాధనం కాదు.. ఎక్కడికెళ్లినా మీ ఆకలి తీర్చే కార్డు" అని సీఎం వ్యాఖ్యానించారు. పేదల సంక్షేమానికి రేషన్ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని, ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకుని పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా–బొరుసులాంటివని విమర్శించారు.




**పేదలకు సన్నబియ్యం అందిస్తున్నాం...**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని పేదలు వినియోగించారా అని సీఎం ప్రశ్నించారు. తమ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తోందని, ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ రేషన్ షాపుల ద్వారా ఇంత నాణ్యమైన సన్నబియ్యం అందించడం లేదని అన్నారు. రేషన్ షాపులతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని సీఎం వివరించారు.

**కోటి మందికి పైగా స్మార్ట్ రేషన్ కార్డులు...**

సెక్యూరిటీ ఫీచర్లతో స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించినట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల మందికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. సంగారెడ్డి వేదికగా పలువురు లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం....**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం ఏటా రూ.11 వేల కోట్లు ఆర్టీసీకి అందిస్తోందని తెలిపారు.

**రైతులకు రూ.1.75 లక్షల కోట్ల వ్యయం**

రైతుల సంక్షేమం కోసం ఇప్పటివరకు రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని సీఎం పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం ఏటా రూ.35 వేల కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల ద్వారా రైతుల ఖాతాల్లో రూ.90 వేల కోట్లు జమ చేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ చేసి అండగా నిలిచామని రేవంత్ రెడ్డి తెలిపారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ రైతులకు ఎందుకు రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు.

**సన్నధాన్యానికి రూ.500 బోనస్...**

సన్నధాన్యం పండించే రైతులను ప్రోత్సహించేందుకు క్వింటాలుకు రూ.500 బోనస్‌తో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని సీఎం తెలిపారు. గతంలో "వరి వేస్తే ఉరి వేసుకున్నట్లే" అన్న కేసీఆర్ వ్యాఖ్యలను గుర్తుచేస్తూ, తమ ప్రభుత్వం మాత్రం రైతులను వరి సాగు చేసుకోవాలని ప్రోత్సహిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 32 నెలల్లో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు కింద రూ.36 వేల కోట్లు జమ చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు.

**చరిత్రలో నిలిచిపోయే రోజు...**

పంద్రాగస్టు రోజున తెలంగాణ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చరిత్రలో నిలిచిపోయే పండుగలా గుర్తుండిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, మహిళల సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర నర్సింహ, వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మలా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co